
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
గురువారం, జూలై 23, 2026 పేజీలు : 7







### సెప్టెంబర్ నెలాఖరు నాటికి భూ సేకరణ

# పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక




**నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)** మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ ను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎం ఎన్ కే ఎల్ భూసేకరణపై రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సేకరణ ప్రక్రియ కు సంబంధించి రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలన్నారు.

## భూత్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- భూ భారతి దరఖాస్తులు, ఆరోగ్య సేవలపై సమీక్ష
- మీ సేవ పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి
- ఎస్ ఐ ఆర్ డిజిటైజేషన్‌ను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం



### రాహుల్, ప్రియాంక గాంధీలపై పోలీసుల చర్యలు

# ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ఛలో లోక్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే
- విద్యార్థులు, కాంగ్రెస్ నేతలపై పోలీసు చర్యలను ఖండించిన ఎమ్మెల్యే




**జడ్చర్ల, జూలై 22 ( ప్రజా జ్యోతి )** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన "ఛలో లోక్ భవన్" కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విద్యార్థులు, కాంగ్రెస్

### ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన

## పోలీసు సేవలు అందించాలి

### ఎస్పీ నారాయణపేట వినీత్




# మట్టి వినాయకులనే ప్రతిష్ఠించండి

- గో గ్రీన్ -- సేవ్ ఎన్విరాన్‌మెంట్‌కు కలెక్టర్ మద్దతు
- డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందంతో కలెక్టర్ భేటీ
- పర్యావరణహిత వినాయక చవితి నిర్వహించాలని పిలుపు



## ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన
# పోలీసు సేవలు అందించాలి

నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)
నారాయణపేట జిల్లా పోలీసు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ బుధవారం నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించి రికార్డులు, పెండింగ్ పిటిషన్లు, విచారణల పురోగతి, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన ప్రతి పిటిషన్‌ను వెంటనే ఎంట్రీ చేసి, నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేసి ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఎలాంటి పిటిషన్‌ను అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ఒకవేళ పెండింగ్‌లో ఉంటే దానికి గల కారణాలను వారికి తెలుపుతూ రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.ప్రతి రోజు జనరల్ డైరీ (+ఐ) తప్పనిసరిగా నమోదు చేయాలని, రోజు వారి విధుల వివరాలు క్రమబద్ధంగా నమోదు చేయాలని ఆదేశించారు. బయటి విధులకు వెళ్లే ప్రతి పోలీసు సిబ్బందికి సంబంధిత డ్యూటీ పాస్/అధికార అనుమతి పత్రం జారీ చేసి, వారి రాకపోకల వివరాలు నమోదు చేయాలని సూచించారు.
అన్ని కేసులను జజుచీూ (జతీఱఎవ ఖఱఅ జతీఱఎఱఅఖ్రీ ఽతీఖఎఎఱఅస్త్ర చీవ్‌షశీతీ౯ ఒ ౣఎర్‌వఎం) ఆన్‌లైన్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని, ఎలాంటి కేసు ఎంట్రీ పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసు సమాచారాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి నవీకరించాలని ఆదేశించారు.
ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సామాజిక అంశాలపై సైబర్ నేరాలు, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.ప్రతి రోజు విధులు ప్రారంభానికి ముందు రోల్ కాల్ నిర్వహించి, సిబ్బందికి విధుల కేటాయింపు, చట్టాలు, క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధానంపై సూచనలు ఇవ్వాలని తెలిపారు. స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లు, కేసు వివరాలు పూర్తిస్థాయిలో, ఎలాంటి లోపాలు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు మరింత త్వరితగతిన న్యాయం అందించేందుకు అవసరమైన చోట ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ (ౣఅ-ంటీవ ఖీ×=) నమోదు చేసే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి వారి ఫిర్యాదుకు సంబంధించిన రసీదు తప్పనిసరిగా అందజేయాలని, కేసు నమోదు చేసిన అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని ఉచితంగా ఇవ్వాలని స్పష్టం చేశారు.
పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ పాటించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించి పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఎస్పీ సూచించారు.
ఈ తనిఖీలో డీఎస్పీ నల్లపు లింగయ్య, టౌన్ సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లుతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

### సెప్టెంబర్ నెలాఖరు నాటికి భూ సేకరణ పూర్తి చేయాలి

కాన్సెంట్ లు తీసుకుని అవార్డులు త్వరగా పూర్తి చేయాలన్నారు.సెప్టెంబర్ 30లోపు భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. సాకులు చెప్పకుండా లక్ష్యాల ప్రకారం పని చేయాలన్నారు.అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని,లక్ష్మీపూర్ ట్యాంక్ ప్రాంతానికి సంబంధించిన పనులను ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సూచించారు.ఆర్. ఐ లు తమ తమ పరిధిలో పట్టాల పరిశీలన చేసి,నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు.నాలుగు సర్వే టీంలను ఏర్పాటు చేయాలన్నారు.స్పీడ్ పెంచి టేబుల్ వర్క్ పూర్తి చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు.ప్రతిరోజూ ఆయా మండలాల పరిధిలోని నిర్దేశించిన గ్రామాలలో ఎన్ని ఎకరాలు సేకరణ పూర్తి అయిందనే ప్రోగ్రెస్‌ను తానే ఫాలోఅప్ చేస్తానని కలెక్టర్ వెల్లడించారు.పని చేయలేని వారు తప్పుకోవాలని సున్నితంగా హెచ్చరించారు.దామర గిద్ద మండలంలోని గడప, విఠలాపూర్, అన్నాసాగర్ తదితర గ్రామాల పనులను వేగవంతం చేయాలన్నారు.పీ ఎస్ సూచనల ప్రకారం ప్రతిరోజూ ప్రోగ్రెస్‌ను సమీక్షిస్తామని తెలిపారు. గుండుమల్, కోస్గి మండలాలలో భూ సేకరణ ప్రక్రియ వేగిరం చేయాలని ఆయా మండలాల తహసిల్దార్ల ను ఆదేశించారు. మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జిల్లాలోని ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూ సేకరణ ను సెప్టెంబర్ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆమె పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో డీ ఆర్ వో రాజ్యలక్ష్మీ, ఆర్ డి ఓ రమేష్, ఎస్. డీ.సీ. రాజేందర్ గౌడ్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

### మట్టి వినాయకులనే ప్రతిష్ఠించండి

మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న "గో గ్రీన్ -- సేవ్ ఎన్విరాన్‌మెంట్" అవగాహన కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి, రానున్న వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత వేడుకలను ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, "గో గ్రీన్ -- సేవ్ ఎన్విరాన్‌మెంట్" కార్యక్రమాన్ని అభినందిస్తూ జిల్లా పరిపాలన తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహిత వినాయక చవితిని నిర్వహించాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ ప్రచార కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు, యువత, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రజా ప్రదేశాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రతి కుటుంబం పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకునేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండాలని, జలాశయాలకు హాని కలగకుండా విగ్రహ నిమజ్జనం నిర్వహించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సువర్ణ రాజ్, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, చందు యాదవ్, ప్రచార కార్యక్రమ సమన్వయకర్త రాకేష్, కాంగ్రెస్ నాయకులు వినయ్, రాజేష్, దామోదర్, సతీష్, పలువురు సామాజిక కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు.

### ఖాజీపూర్ గ్రామంలో ఏరులై పారుతున్న మద్యం

**- పట్టించుకోని అధికారులు**

**-గ్రామ పంచాయతీ దగ్గర బీర్ తాగి సీసలు పగలగొట్టడం, మూత్రవిసర్జన చేయడం**

నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)
నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో యువతతో పాటు పలువురు మద్యానికి బానిసలవుతున్నారని వారు చెబుతున్నారు.అక్రమ మద్యం విక్రయాల వల్ల గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.అక్రమ మద్యం విక్రయాలను వెంటనే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని గ్రామ ప్రజలు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ అధికారులను కోరుతున్నారు.



## రాహుల్, ప్రియాంక గాంధీలపై
## పోలీసుల చర్యలు
# ప్రజాస్వామ్యానికి విరుద్ధం

కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై లాఠీచార్జి చేయడం, బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.ప్రజల గొంతును అణచివేసేందుకు బలప్రయోగం చేయడం ఏ ప్రభుత్వానికీ తగదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు.

### భూత్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలో భూ భారతి, మీ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం భూత్పూర్ మండలంలో పర్యటించిన ఆమె తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
తహశీల్దార్ కార్యాలయంలో భూ భారతి, మీ సేవ దరఖాస్తుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, క్షేత్రస్థాయి విచారణ అవసరమైన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై ఆరా తీసిన ఆమె, బీఎల్‌వోలు గ్రామాల్లో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణను వారం రోజుల్లో పూర్తి చేసి, వాటి డిజిటైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కిషన్ పాల్గొన్నారు. అనంతరం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడి ఆరోగ్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల వైద్య పరీక్షలకు సంబంధించి ఫాలోఅప్ కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రయోగశాల రికార్డులను పరిశీలించి, అసాధారణ పరీక్ష ఫలితాలు వచ్చిన రోగులను వెంటనే సంప్రదించి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రిలో రోజుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల ఓపీ 40--50 మంది, సాధారణ ఓపీ 80--100 మంది వరకు ఉంటుందని వైద్యాధికారులు వివరించారు. ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్, రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాల అమలుపై కూడా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి బుధవారం, శనివారం రొటీన్ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో మెడికల్ ఆఫీసర్ డా. అబ్దుల్ రబ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### ముగిసిన 3 రోజుల ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం

కృష్ణా జూలై 22 (ప్రజా జ్యోతి)
కృష్ణా మండలం పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ కృష్ణా ఉన్నత పాఠశాల వేదికగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్ జీ టీ) నిర్వహించిన మూడు రోజుల 'మండల స్థాయి ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్' ( ఇంటిగ్రేటెడ్ ఇన్ -సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్) కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ ( ఎస్ సి ఈ ఆర్ టీ) సంయుక్త ఆధ్వర్యంలో "నైపుణ్యంతో కూడిన బోధన - తరగతి గదుల్లో విప్లవాత్మక మార్పులు" అనే ప్రధాన ధ్యేయంతో ఈ శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను తరగతి గదుల్లో అమలు చేసి, విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందిస్తామని పేర్కొన్నారు.



# అరెస్టులతో విద్యార్థులను,రాహుల్ గాంధీని అడ్డుకోలేరు






## -ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : జులై 22 (ప్రజా జ్యోతి)**
అరెస్టులతో రాహుల్ గాంధీని,విద్యార్థులను అడ్డుకోలేరని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌కూడలిలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో నీట్ (బీజులు-ఖ+) పేపర్ లీక్ వ్యవహారానికి వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని మరియు విచక్షణారహితంగా విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని,టియర్ గ్యాస్ ప్రయోగించడానికి నిరసిస్తూ పెద్దఎత్తున నిరసన (ధర్నా) కార్యక్రమం నిర్వహించి దిష్టిబొమ్మ దగ్ధంచేసి కేంద్ర ప్రభుత్వానికి మరియు ప్రధాని నరేంద్ర మోడీ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి అనంతరం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నీట్ (బీజులు) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం,టియర్ గ్యాస్ ప్రయోగించడం అమానుషమని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ,కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నీట్ వ్యవహారంపై కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని,యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# ఐ సపోర్ట్ సోనం వాంగ్చుక్'కు పాలమూరులో విద్యార్థుల మద్దతు

### - జంతర్ మంతర్ నిరాహార దీక్షకు సంఘీభావం, విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించిన పీయూ జేఏసీ




**మహబూబ్‌నగర్, జులై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో 'ఐ సపోర్ట్ సోనం వాంగ్చుక్' పేరుతో విద్యార్థుల నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్, తెలంగాణ స్టూడెంట్ రివల్యూషన్ జాక్స్ వ్యవస్థాపకుడు పోలే నరేందర్, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకుడు రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా పోలే నరేందర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కుల పరిధిలోనే విద్యార్థులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా జరుగుతున్న నిరాహార దీక్షపై పోలీసులు చర్యలు తీసుకోవడం, అక్కడ ఉన్న విద్యార్థులు, సామాజిక కార్యకర్తలపై లాఠీచార్జి జరగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.పాలమూరు యూనివర్సిటీ, న్యూ టౌన్‌లోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద, అలాగే మహబూబ్‌నగర్ డైట్ కళాశాల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని "ఐ సపోర్ట్ సోనం వాంగ్చుక్" నినాదాలతో సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ఉదయ్, మనోహర్, బాలు, ధర్మేంద్ర, అరుణ్ రాజు తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి





## అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల జూలై 22(ప్రజా జ్యోతి):**
ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వివిధ సంస్థలు నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు.బుధవారం గద్వాలలోని ప్రభుత్వ ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో ఆర్‌సెటీ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని యువత ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.పుట్టగొడుగుల పెంపకం తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని అందించే లాభదాయకమైన ఉపాధి మార్గమని తెలిపారు.ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతకు నైపుణ్యాలు పెంపొందడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్,ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఆర్‌సెటీ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టులను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

### - నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్



**మహబూబ్‌నగర్, జులై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్. వినోద్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోందని, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఆందోళనకు కారణమైన నీట్ పేపర్ లీక్ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఢిల్లీ జంతర్ మంతర్‌లో విజేపీ శాంతియుత నిరసనలకు సంపూర్ణ మద్దతు

### పోలీసుల లాఠీచార్జ్‌ను ఖండించిన సీపీఐ నాయకుడు చిట్టెం కిష్టన్న




**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూలై 22:**
సివిల్ డ్రెస్‌లో లాఠీచార్జ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి --నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విజేపి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరుద్యోగుల నిరసనలకు ఐజ మండల సీపీఐ పార్టీ కార్యదర్శి చిట్టెం కిష్టన్న సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు,సామాజిక కార్యకర్తలు, రాజకీయ ప్రముఖులను పోలీసులునిర్బంధించడం,లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.సివిల్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తులు లాఠీచార్జ్‌లో పాల్గొన్నట్లయితే,వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌పై నమోదైన కేసులను ఉపసంహరించుకుని,ఆయనపై విధించిన నిర్బంధాలను ఎత్తివేయాలని కోరారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీల కారణంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న కుటుంబాలకు తగిన న్యాయం చేయడంతో పాటు, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి,దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే,సామాజిక మాధ్యమాల్లో ఉద్యమకారులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ విషప్రచారం చేస్తున్న వారిపైనా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిట్టెం కిష్టన్న డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ,శాంతియుత నిరసనలకు ప్రభుత్వం గౌరవం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రమీల ఫౌండేషన్ అన్నదాన కార్యక్రమం -- మొబైల్ యాప్ ఆవిష్కరణ

**నారాయణపేట, ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)**

సమాజ సేవే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులు మరియు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్రమీల ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. కోరం మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలు, ఆపదలో ఉన్నవారు మరియు అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించేందుకు ప్రమీల ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రజలకు ఫౌండేషన్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల సమాచారం, సభ్యత్వ నమోదు, స్వచ్ఛంద సేవా అవకాశాలు మరియు ఇతర సేవలను సులభంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించి అధికారికంగా ఆవిష్కరించినట్లు డా. కోరం మహేష్ రెడ్డి తెలిపారు.అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులు మరియు



నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కోరం శివరాజ్ రెడ్డి,కోరం హర్షవర్ధన్ రెడ్డి, సత్యపాల్, భీమ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహా, రమేష్, కోరం గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రోగులు, వారి సహాయకులు మరియు ప్రజలు ప్రమీల ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# బాలబాలికలు తప్పనిసరిగా పాఠశాలలలో చదవాలి

**-విద్యార్థులు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**-డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య**

**నాగర్ కర్నూల్ :: జులై 22 - ప్రజా జ్యోతి**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ గారి ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్స్ జిల్లాయూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యాలవాడలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కాన్సిల్ శ్రీ రామ్ ఆర్య హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీరామ్ ఆర్య బాలల హక్కుల గురించి వివరిస్తూ బాల బాలికలు తప్పనిసరిగాప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని అన్నారు. బాలబాలికలందరూ ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండి ఫోన్లో వచ్చిన మెసేజ్లను,వీడియోలను ఇతరులకు పంపడం,తిరిగి సమాధానం ఇవ్వడం చేయరాదని,మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటికి దూరంగా




ఉండాలని,తల్లి దండ్రులను,ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత స్థితిని పొందాలన్నారు.ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ఫోక్సో చట్టం అడ్డుకట్ట వేస్తుందన్నారు.అమ్మాయిలు తమకు ఏమైన సమస్యలు ఉన్నా షీ-టీం కు గాని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గాని సమాచారమివ్వాలని,అదేవిదంగా న్యాయ సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్కు ఫోన్ చేసి లబ్ధిపొందాలన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు బోరు కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలి

**- బీజేపీ నాయకుల ఫిర్యాదు**

**గండీడ్, జూలై 22 (ప్రజా జ్యోతి):**

గండీడ్, మహ్మదాబాద్ మండలాల బీజేపీ నాయకులు బుధవారం మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి వినతిపత్రం అందజేసి, చిన్న వార్వల్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బోరు కృష్ణయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజ్ అంశంపై గౌరవ సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత కూడా విద్యాశాఖ మంత్రిపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ, పార్టీపై ప్రజల్లో అపోహలు కలిగించేలా బోరు కృష్ణయ్య పత్రికా ప్రకటనలు ఇవ్వడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధ చేయాల్సిన వ్యక్తి రాజకీయ వివాదాల్లో జోక్యం చేసుకుని విద్యార్థులను, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.రాజకీయాలపై అంత ఆసక్తి ఉంటే ఉపాధ్యాయ వృత్తిని పక్కనబెట్టి రాజకీయాల్లోకి రావాలని శంకర్ నాయక్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం సేవా నియమావళికి విరుద్ధమని, ఇలాంటి చర్యలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తూ, బోరు కృష్ణయ్యపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత శాఖ అధికారులు కూడా ఈ వ్యవహారాన్ని విచారించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో... మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు మూస నర్సింలు, మాజీ మండల అధ్యక్షులు ప్రభు నాయక్, కురువ కృష్ణ, గండీడ్ మండల ఉపాధ్యక్షులు గడ్డమీది మల్కయ్య, బద్రిశ్వర్, మండల బీజేవైఎం అధ్యక్షులు యాదగిరి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు బాలయ్య, మండల బిజెపి నాయకులు నరహరి రెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణయ్య, కృష్ణారెడ్డి, మోహన్, జ్ఞానేశ్వర్, నరేష్, సురేష్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

**- ప్రతి చిన్నారికి సకాలంలో టీకాలు వేయాలి**

**- గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, సుఖ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు బుధవారం జడ్చర్ల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బాదేపల్లి--ఏ, బాదేపల్లి--సీ, కావేరమ్మపేట ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రతి బుధవారం నిర్వహించే రెగ్యులర్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి వారి వయస్సుకు అనుగుణంగా వేయాల్సిన టీకాలను సకాలంలో వేయడం ద్వారా సంపూర్ణ వ్యాధి నిరోధక శక్తి పెంపొందించి, అంటువ్యాధుల నుంచి రక్షించవచ్చని తెలిపారు. తనిఖీలో భాగంగా టీకాలను వ్యాక్సిన్ క్యారియర్లలో సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేస్తున్నారా, లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా తగినంత వ్యాక్సిన్లు అ2oదుబాటులో ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు. అనంతరం అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందుతున్న చికిత్స వివరాలను సమీక్షించారు. గర్భిణులు గర్భం దాల్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా బర్త్ ప్లానింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తదనంతరం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. అషదుల్లాతో ప్రసవాల నిర్వహణ, మాతా-శిశు ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీల్లో డా. శివకాంత్, డా. భరత్, సంబంధిత ఏఎన్ఎంలు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయ సమస్యల సాధనకై ఆగస్టు 1న తపస్ మహాధర్నా

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 22 (ప్రజా జ్యోతి):**

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల సాధన కోసం ఆగస్టు 1న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మక్తల్ దగ్గర మక్తల్ మండల విద్యాధికారి శ్రీ అమీరుద్దీన్ గారి చేతుల మీదుగా మహాధర్నా గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రవీందర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న సమస్యల సాధన కోసం అనేకసార్లు విన్నవించిన ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే దశల వారి ఉద్యమ కార్యాచరణకు పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పిఆర్సి వెంటనే ప్రకటించాలని, ఆరు డీఏలు విడుదల చేయాలని, సిపిఎస్ విధానం రద్దు పరిచి పాత పెన్షన్ అమలు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని,కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటిఎస్ అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ తో ఈ మహాధర్న చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గౌడ్, నాగేశ్వరయ్య, నాగార్జున తపస్ జిల్లా నాయకులు వెంకట్ రాములు, మక్తల్ మండల ప్రధాన కార్యదర్శి రాకేష్ కుమార్, మండల బాధ్యులు ప్రవర్ధన్, రాజంజనేయులు,అనిల్ రెడ్డి,రవీందర్ రెడ్డి, మదన్, జగదీశ్, ధన్సింగ్, కమలాకర్, నరసింహ, రాములు,తపస్ ప్రాథమిక సభ్యులు తదితర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలి





## ఆర్ఐ విజయ్ భాస్కర్

**నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచడం, ఆయుధాల వినియోగంలో మరింత ప్రావీణ్యం సాధించడం లక్ష్యంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, ప్రతి పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసంతో పాటు ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన, నైపుణ్యం కలిగి ఉండడం అత్యంత అవసరమన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పరేడ్, డ్రిల్, ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో నిరంతరం సాధన చేయాలని తెలిపారు. శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని అన్నారు. అంతేకాకుండా, చట్టాలపై అవగాహన, ఆధునిక దర్యాప్తు విధానాలు, ప్రజా సంబంధాల మెరుగుదల, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ప్రతి పోలీసు సిబ్బంది పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు పోలీసు సిబ్బందికి డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం తదితర అంశాలపై శిక్షణ అందించారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ శిరీష, ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మూడు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతం

నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)
ప్రభుత్వ పాఠశాలలో బోధన నాణ్యతను పెంచడంతోపాటు విద్యార్థుల అభ్యసనం మెరుగుపరచడం కొరకు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు సమగ్ర ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణలో భాగంగా కస్తూరిబా గాంధీ విద్యాలయం నారాయణపేట యందు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ శిక్షణలో భాగంగా నారాయణపేట మండల విద్యాధికారి బాలాజీ గారు మూడవరోజు శిక్షణ కేంద్రాన్నిసందర్శించి ఉపాధ్యాయులందరు విద్యార్థి కేంద్రీకృతంగా బోధన చేయాలని, అలాగే వెనుకబడిన విద్యార్థుల పైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఆధునిక బోధన విధానాలను పాటిస్తూ, మౌళిక భాషా గణిత సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులందరు కృషి చేయాలని సూచించారు. కాలానుగుణంగా విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం,సమర్థవంతమైన తరగతి



గది బోధన,నిరంతర సమగ్ర మూల్యాంకనం, ప్రత్యేక అవసరాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యా ప్రమాణాలను పెంచాలని తెలియజేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివేలా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ప్రోత్సహించాలని తద్వారా విద్యార్థులఅభ్యాసన సామర్థ్యాలు పెంపొందుతాయని అన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు అందరూ వారి వృత్తి నైపుణ్యమును మరింత పెంపొందించుకొని విద్యా ప్రమాణాలను పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి లు భీమప్ప ,రఘువీర్, సత్యనారాయణ, సాయిలు, ఐశ్వర్య,శంకర్,బాల కిష్టప్ప,చంద్రకాంత్, లాలప్ప మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ఎస్ఐఆర్ పురోగతిపై రాజకీయ పార్టీలతో ఈఆర్ఓ సమీక్ష

**– ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 83.74 శాతం పూర్తి**

**ఆగస్టు 3లోగా ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం**

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 75--జడ్చర్ల శాసనసభ నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాల (ఈఎఫ్‌లు) డిజిటైజేషన్ పురోగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం 83.74 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను ఆగస్టు 3వ తేదీలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నట్లు ఈఆర్ఓ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ), జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, అదనపు తహసీల్దార్, డీటీ (జడ్చర్ల), 75--జడ్చర్ల నియోజకవర్గ ఎన్నికల డీటీతో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట పట్టణంలోని శాసన్‌పల్లి రోడ్డులో చాలా కాలంగా నెలకొన్న తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన నూతన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కొండ స్వేత సత్య యాదవ్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల శాసన్‌పల్లి రోడ్డులోని స్థానికులకు నెలకొన్న విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గి, మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ (౦+ట్రాణజూ) అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## రచయిత దాశరథి కృష్ణమాచార్య జయంతి



**నారాయణపేట ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)**
బుధవారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో ప్రముఖ తెలంగాణ ఉద్యమ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 22 వ తేదీన నిర్వహించుకుంటారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించిన మహాకవి ఆయన. తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. పలు సినిమాలకు గేయరచయితగా పనిచేశాడు. ప్రతి సంవత్సరం దాశరథి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి తెలంగాణా ప్రభుత్వం దాశరథి సాహితీ పురస్కారం అందజేస్తోంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాను ప్రకాష్ మంగళ నిర్మల లక్ష్మణ్ నరసింహ ప్రతాప్ శశిరేఖ శ్రీదేవి సాయి కిరణ్ సంగీత వెంకటేష్ పాల్గొన్నారు

## ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

**వడ్డేపల్లి జూలై 22(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మండలంలోని ఐకేపీ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి రెడ్డప్ప అధ్యక్షతన మండల స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణంలో సంభవించే మార్పులు,పంటలపై పడే ప్రభావం,పశువుల మేత లభ్యత,తాగునీటి సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే జూలై 23, 24 తేదీల్లో గ్రామాల్లో వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పించే సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,రైతులు మరియు ప్రజలకు అవసరమైన సూచనలు అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శివకుమార్,ఎంపీడీవో సుదర్శన్,వ్యవసాయ అధికారి రాధా,ఏపీవో అనిల్ కుమార్,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



## “షాప్ టూ షాప్” కార్యక్రమాన్ని చేపట్టిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్

**-వినియోగదారుల చెంతకుయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి...**
**-నారాయణపేట బ్రాంచి నుంచి అందించే వివిధ పథకాలను వివరించిన బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప...**

**అందర్నీ ఆకట్టుకున్న”షాప్ టూ షాప్”కార్యక్రమం...**





**నారాయణపేట, ప్రతినిధి జూలై 22 (ప్రజా జ్యోతి)**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో “షాప్ టూ షాప్ “వినియోగదారుల సేవా కార్యక్రమాన్ని బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖలు కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా”షాప్ టు షాప్” వినియోగదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బ్రాంచి మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని,వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు,ఆర్థిక పరిష్కారాలను అందించడం ప్రధాన లక్ష్యంగా చేపట్టబడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాఖలలోని అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు,శాఖ మేనేజర్లు,అధికారులు, క్లరికల్ సిబ్బంది,సబార్డినేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.వ్యాపార సంస్థలు,దుకాణాలను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగదారులతో మమేకమై వారి అవసరాలను తెలుసుకొని తగిన బ్యాంకింగ్ ఉత్పత్తులను ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప పరిచయం చేశారు.ఈ సందర్భంగా పొదుపు,కరెంట్ ఖాతాలు,వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు,ఎంఎస్ఎంఈ రుణాలు,వ్యవసాయ రుణాలు,డిజిటల్ బ్యాంకింగ్ సేవలు,బీమా,పెట్టుబడి పథకాలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. అలాగే సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని ఆయన ఖాతాదారులకు ఈ సందర్భంగా ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు.వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూఅన్ని కేడర్ల ఉద్యోగులు అంకితభావంతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రాంతీయ కార్యాలయం అభినందనలు తెలిపింది.

## కిడ్నీ బాధిత కుటుంబానికి అండగా బెక్కెం వేణుగోపాల్ రెడ్డి



**చిన్నంబావి,జులై 22 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన మేకల వసంత్ కుమార్ తీవ్ర కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నారు. చికిత్సకు భారీగా ఖర్చు కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఆయన భార్య మేకల జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి వెల్టూరు గ్రామానికి చెందిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డి నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతితో నేరుగా మాట్లాడి రోగికి అత్యవసర వైద్య చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం కూడా ప్రత్యేకంగా కృషి చేశారు.కిడ్నీ చికిత్స అత్యంత వ్యయభరితమని గుర్తించిన ఆయన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డిని సంప్రదించారు. వారి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్ఓసీ మంజూరై, రోగి చికిత్సకు మార్గం సుగమమైంది.ఈ సహాయం ఒక ఆర్థిక చేయూత మాత్రమే కాకుండా, తీవ్ర నిరాశలో ఉన్న కుటుంబానికి కొత్త ఆశను, ధైర్యాన్ని అందించిన మానవతా స్పందనగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తమ కష్ట సమయంలో వెంటనే స్పందించి అండగా నిలిచిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డి సేవలను కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజా అవసరాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న ఆయనకు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**-రైతులకు స్ప్రింక్లర్ పైపులు పంపిణీ**
**-రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటా**
**-ఎమ్మెల్యేడాక్టర్. రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ : జులై 22(ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం తాడూర్ మండలానికి చెందిన రైతులకు ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని,ఈ స్ప్రింక్లర్ విధానంవల్ల తక్కువ నీటితో ఎక్కువవిస్తీర్ణంలో సాగు చేయడంతో పంట దిగుబడి పెరుగుతుందని,రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలన్నారు.రైతులకు అవసరమైన ప్రతివిషయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ ఛైర్మెన్ రాంచంద్రా రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్,వివిధ గ్రామాల సర్పంచ్లు,ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు,కాంగ్రెస్ నాయకులు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రుసుంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

**పరిగి డిపో మేనేజర్‌కు బీజేపీ యువ నాయకులు**



**ప్రజాజ్యోతి -- గండీడ్**
గండీడ్ మండలంలోని రుసుంపల్లి గ్రామానికి గతంలో నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా గండీడ్ మండల నాయకుడు చిట్యాల యాదగిరి ఆధ్వర్యంలో పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రుసుంపల్లి గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా ఐనాపూర్--మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రతిరోజూ ఉదయం 8:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు నడిచేదని తెలిపారు. అయితే గత ఏడాది నుంచి ఆ బస్సు సర్వీసును నిలిపివేయడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా విద్యార్థులు ప్రతిరోజూ బరువైన పుస్తకాల బ్యాగులతో సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి ప్రధాన రహదారిపై బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, అత్యవసర వైద్య అవసరాల కోసం వెళ్లే ప్రజలు కూడా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అందువల్ల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రుసుంపల్లి గ్రామానికి గతంలో ఉన్నట్లుగానే ఐనాపూర్--మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించి గ్రామ ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు ప్రయోజనం కలిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పరిగి డిపో మేనేజర్‌ను కోరారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి వరం. ఈ ఎన్ టి స్పెషలిస్ట్ గా డాక్టర్ శ్రీనివాసులు.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**
మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సీనియర్ అసిస్టెంట్ గా సర్జన్ ఈ ఎన్ టి స్పెషలిస్ట్ గా డాక్టర్ శ్రీనివాసులు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా సేవలందించిన డాక్టర్ శ్రీనివాసులు పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఆపద్బాంధవుడిగా గుర్తింపు పొందారు. రోగులతో ఆత్మీయంగా మెలుగుతూ సేవాభావంతో వైద్యం అందించిన ఆయన ప్రజల అభిమానాన్ని చురగొన్నారు. వైద్య విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే ఉన్నత వైద్య విద్యను అభ్యసించి ఈ ఎన్ టి స్పెషలిస్ట్ గా బాధ్యతలు చేపట్టడం ఆయన కృషి పట్టుదలకు నిదర్శనమని పలువురు ప్రశంసించారు. ఇకపై మండల ప్రజలకు చెవి ముక్కు గొంతు సంబంధిత ప్రత్యేక వైద్య సేవలు స్థానిక ప్రభుత్వం ఆస్పత్రిలోనే అందుబాటులోకి రావడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని పేద ప్రజలకు నిత్యం అండగా నిలవాలని ప్రజలు ఆకాంక్షించారు అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ ఎన్ టి ప్రత్యేక వైద్య సేవలను మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, స్వచ్ఛ భారత్ పనులను వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలో అమలవుతున్న జలసిరి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛ భారత్ మిషన్, వనమహోత్సవం, ఉద్యానవన పంటల పెంపకం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ), జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ--జెడ్పీ), మహబూబ్‌నగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ--హౌసింగ్)లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

సమావేశంలో ముందుగా కార్మికుల పనితీరు నివేదిక (లేబర్ రిపోర్ట్)ను పరిశీలించిన అదనపు కలెక్టర్, జలసిరి కార్యక్రమంలో వ్యవసాయ కుంటలు, పర్కొలేషన్ ట్యాంకులు, సామూహిక ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్‌పిట్స్, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు, బహిరంగ బావుల నిర్మాణాలకు సంబంధించిన పనులను వెంటనే గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో గ్రామాల వారీగా మస్టర్ల జారీ, ప్రాజెక్టు డేటా (పీడీలు) తయారీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐహెచ్‌హెచ్‌ఎల్‌లు), సామూహిక మరుగుదొడ్ల సముదాయాలు (సీఎస్‌సీలు), సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కల నాటేందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేసి గుంతల తవ్వకం పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే ఉద్యానవన పంటల పెంపకం లక్ష్యాలను సాధించేందుకు రైతులను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఓలు, ఏపీడీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీపీఎంలు, ఏపీఓలు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల ఏఈలు, పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ భారీ నిరసన

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద భారీ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రజల తరఫున పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని విమర్శించారు. దేశ యువత, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ పేపర్ లీక్ ఘటనపై ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.

ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు ఎంత చేసినా కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, రాజ్యాంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కులు, సామాన్య ప్రజల న్యాయం కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ.పీ. మిథున్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. నర్సింహా రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

29



# మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం..

**-యువతే సమాజానికి మార్గదర్శకులు: జిల్లా ఎస్పీ జానకి**

**- తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం**

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ దరావత్ జానకి విద్యార్థులను ఉద్దేశించి అవగాహన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ప్రత్యేక అవగాహన వీడియోలను ప్రదర్శిస్తూ, మాదకద్రవ్యాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు ఎలా నాశనమవుతాయో, కుటుంబం, స్నేహితులు, సమాజంపై వాటి ప్రభావం ఎలా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన జిల్లా ఎస్పీ జానకి, యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశలో మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు, కుటుంబ బంధాలు, సమాజంలో గౌరవం వంటి అమూల్యమైన అంశాలను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యతను స్వీకరించి, ఇతరుల్లోనూ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా రవాణా చేస్తున్నా వెంటనే 1908 లేదా సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారిని శిక్షించడం కాకుండా, అవసరమైతే డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వివరించారు. అనంతరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రోంజ్ పతకాలను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ఇతర విద్యార్థులకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐపీఎస్ తరఫున ప్రశంసాపత్రాలు, యాంటీ డ్రగ్ సోల్జర్స్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎన్. బుచ్చయ్య, ఎస్‌వీఎస్ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్ రెడ్డి, రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, అధ్యాపకులు, ఈగల్ ఫోర్స్ సభ్యులు, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




# మంత్రి హోదా లభించిన సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

**- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అభినందనలు**

**- ప్రజాసేవకు మరింత కృషి చేస్తానన్న ప్రభుత్వ విప్**

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** రాష్ట్ర మంత్రి హోదా లభించిన సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు యెన్నం శ్రీనివాస్ రెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన సేవలు కొనసాగిస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా మాట్లాడిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తనపై చూపుతున్న అభిమానానికి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హోదా తనకు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొంటూ, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు మరింత నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ఐక్యంగా పనిచేస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించవచ్చని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్.పీ. వెంకటేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు రాములు యాదవ్, సాయిబాబా, దోమ పరమేశ్వర్, నాయకులు ఫయాజ్, అజ్మత్ అలీ, ఎన్.పీ. నేహాశ్రీ, కంచి లక్ష్మణ్, శ్రీనివాస్ యాదవ్, మైత్రి యాదయ్య, మోయిాజ్, చంద్రమౌళి, కిషన్, కార్పొరేటర్లు తాహేర్, మజ్జీద్, రమేష్ రెడ్డి, రమేష్, ఫక్రు, షబ్బీర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

36



# ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి

**-ఎస్ఎఫ్‌సి నిధులు విడుదల చేయకపోతే సర్పంచులపై భారీ భారం తప్పదు**

**-సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ గౌడ్**



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూలై 22 (ప్రజా జ్యోతి):** గ్రామాలలో గెలిచిన నాటి నుండి సరైన నిధులు లేక గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించలేని పరిస్థితిలో నూతనంగా గెలిచిన సర్పంచులు ఉన్నప్పటికీ గతంలో పెండింగ్లో ఉన్న గ్రామ పంచాయతీల విద్యుత్ బకాయిలను చెల్లించమనడంతో సర్పంచ్ల పై భారీ భారం పడుతుందని, కావున రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్సి నిధులు వెంటనే విడుదల చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు సర్పంచ్లకు సహకరించాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కలాల్ రాజేందర్ గౌడ్ అన్నారు. గ్రామపంచాయతీల పెండింగ్ విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని నారాయణపేట జిల్లా డిపిఓ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఆదేశాలు జారీ చేయడంపై బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కలాల్ రాజేందర్ గౌడ్ సర్పంచులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నూతనంగా సర్పంచులు గా గెలిచిన తర్వాత గ్రామాల అభివృద్ధిలో భాగంగా రావలసిన నిధులు రాకపోగా 15 ఫైనాన్స్ కింద వచ్చినటువంటి నిధులు గతంలో ఉన్న పెండింగ్ బిల్లులను చెల్లించడానికి సరిపోయిందన్నారు. అయితే అరకొరగా ఉన్న గ్రామ పంచాయతీల నిధులతోటి విద్యుత్ బకాయిలు చెల్లిస్తే జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీల యొక్క అభివృద్ధి అగమ్య గోచరంగా తయారయ్యే పరిస్థితి ఉంది కాబట్టి సర్పంచుల సమస్యలను గుర్తించి గ్రామాల అభివృద్ధి కుంటు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఎస్ ఎఫ్ సి నిధులనుంచి గ్రామ పంచాయతీల పెండింగ్ విద్యుత్ బకాయాలను చెల్లించే విధంగా ప్రత్యామ్నాయ మార్గం ఆలోచన చేసి గెలిచినటువంటి సర్పంచులు వారి గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు నిధులు విడుదల చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు స్థానిక ఎమ్మెల్యే,మంత్రివర్యులు వాకిటి శ్రీహరికి సర్పంచుల సంఘం తరఫున వారికి విన్నవించుకుంటున్నామని ఆయన అన్నారు. అయితే ఇప్పటికి వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 ఫైనాన్స్ నిధులనుంచి రావాల్సిన మూడు విడతల నిధులు దాదాపు 900 కోట్ల నిధులు ఆగిపోవడంతో పాటు ఇప్పటివరకు ఎస్ఎస్సి నిధులు ఇక్కడ కూడా రావడం జరగలేదు, కొన్ని కొన్ని గ్రామాలలో ఎస్ఎఫ్సి నిధులు ఉన్నా కూడా వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేనందున సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా జిపి ఫండ్స్ ఏవైతే ఉన్నాయో ఈ జిపి ఫండ్స్ గతంలో ట్రెజరీ ద్వారా రిలీజ్ చేసుకునే పరిస్థితి ఉంది అయితే గత కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవో నెంబర్ 73ని సవరణ చేసి జీపీలో ఉన్న నిధులను ఆ గ్రామపంచాయతీ నేరుగా వాడుకునే విధంగా దానిని సవరిస్తామని చెప్పారు ఇప్పటివరకు అది కూడా అమలులోకి రాలేదు తక్షణమే ఆ జీపీ యొక్క ఫండ్స్ కూడా డైరెక్ట్ గ్రామపంచాయతీ అకౌంట్లో నుంచి డ్రా చేసుకొని సర్పంచులు ఆ గ్రామాల అభివృద్ధికి చేసుకునే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుకుంటున్నామని, ఒకపక్క గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు రాకపోగా గ్రామాలలో విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగిపోవడానికి ప్రధాన సమస్య గ్రామాలలోథర్డ్ వైర్ లేకపోవడమే ఈ థర్డ్ వైర్ లేకపోవడం వల్ల ఆన్ ఆఫ్ స్విచ్ లేక విద్యుత్ దీపాలు నిరంతరంగా వెలిగిపోవడం వలన ఈరోజు ఈ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయని, గ్రామాలకు వచ్చినటువంటి కొద్దిపాటి నిధులను విద్యుత్ శాఖ బిల్లులను చెల్లిస్తే, గ్రామాలలో రెండు సంవత్సరాలు అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వెంటనే 2026-27 కు సంబంధించిన ఈ సంవత్సరం ఎస్ఎఫ్సి నిధులను తక్షణమే విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా నారాయణపేట జిల్లా సర్పంచుల సంఘం తరఫున కోరుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాము సర్పంచులు కాకముందు రెండు సంవత్సరాలు ఈ రాష్ట్రంలో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగిందని, స్పెషల్ ఆఫీసర్ల పాలనలో చేసిన అభివృద్ధికి సంబంధించిన నిధులను గాని తాము సర్పంచ్ గా ఎన్నికైన తర్వాత 15 ఫైనాన్స్ నుంచి వచ్చిన నిధులతో స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్న పెండింగ్ బిల్లులు,పారిశుద్ధ్య కార్మికుల ఎన్పీడబ్ల్యు, కంప్యూటర్ ఆపరేటర్స్ జీతాలతో పాటు గత సర్పంచులు గ్రామంలో చేసినటువంటి పనుల యొక్క నిధులను 15 ఫైనాన్స్ నుండి వచ్చిన నిధులతో ఆ బకాయిలను చెల్లించుటకే సరిపోయిందని, సరైన సమయంలో నిధులు విడుదల కాకపోవడం వల్ల నూతనంగా గెలిచిన తమపై భారం పడుతుందని, అభివృద్ధి విషయంలో తమన్న నమ్మి గెలిపించిన ప్రజల నుండి ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గెలిచినటువంటి సర్పంచులు వారి గ్రామాలను అభివృద్ధి చేసుకునే విధంగా వెంటనే ఎస్ ఎఫ్ సి నిధులను విడుదల చేస్తే ఆ నిధులనుండి విద్య విద్యుత్ బకాయిలను చెల్లిస్తూ 15 ఫైనాన్స్ నిధుల నుంచి కానీ, సెంట్రల్ నుంచి వచ్చే 16 ఫైనాన్స్ నిధులను కూడా ఆ గ్రామాల ఆ గ్రామాలలో అభివృద్ధికి ఆ నిధులను మళ్లించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకునే అవకాశం సర్పంచ్లకు కలుగుతుందని, కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్ ఎఫ్ సి నిధుల నుంచి పెండింగ్ విద్యుత్ బకాయిలను సర్పంచులు చెల్లించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సర్పంచ్ ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలలో గ్రామాల అభివృద్ధిలో భాగంగా చిన్న గ్రామానికి 5 లక్షల రూపాయలు,పెద్ద గ్రామానికి 10 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తానని చెప్పడం జరిగింది కాబట్టి చెప్పిన విధంగానే అట్టి ప్రక్రియను అమలుపరిస్తే వచ్చినటువంటి నిధులనుండి పెండింగ్ విద్యుత్ బకాయిలను చెల్లించే వెసులుబాటు ఈ విధంగానైనా సర్పంచులకు అవకాశం కలుగుతుందన్నారు. ఏదిఏమైనా గ్రామాలను అభివృద్ధి పరచడంలో సరైన సమయంలో నిధులు రాక నిధుల విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఎస్ ఎఫ్ సి నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కలాల్ రాజేందర్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు గవినోల్ల సుమిత్రమ్మ,సర్పంచులు ఈడ్డి శ్రీనివాస్ గౌడ్,గాల్ రెడ్డి,శంకర్,శ్రావణ్ కుమార్,ఆంజనేయులుగౌడ్,మహేష్,అశోక్,సురేష్ రెడ్డి,లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ లోనే విజయవంతమైన ప్రసవం...

**-108 సమయస్ఫూర్తితో తల్లి, శిశువుకు ప్రాణరక్షణ**

**-సోమశిల అనూష గర్భిణికి మార్గమధ్యంలో తీవ్ర ప్రసవ నొప్పులు**

**-ఈఎంటీ రాఘవేంద్ర మెడికల్ టెక్నీషియన్ నరేందర్**

**-చాకచక్యంతో పండంటి మగబిడ్డకు జన్మ**

**-108 సేవలను కొనియాడిన గ్రామస్థులు**

**చిన్నంబావి, జూలై 22 (ప్రజా జ్యోతి)**

అత్యవసర వైద్య సేవల్లో 108 అంబులెన్స్ మరోసారి తన సేవా నిబద్ధతను చాటుకుంది. సమయానికి స్పందించి, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ధైర్యంగా వ్యవహరించిన 108 సిబ్బంది ఒక తల్లి, శిశువు ప్రాణాలను సురక్షితంగా కాపాడారు. కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామానికి చెందిన గర్భిణి అనూష (23) మంగళవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా తీవ్ర ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆమె భర్త 108 అత్యవసర అంబులెన్స్ సేవలకు ఫోన్ చేసి సహాయం కోరారు. సమాచారం అందుకున్న చిన్నంబావి మండల 108 అంబులెన్స్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించి కొద్ది సమయంలోనే సోమశిల గ్రామానికి చేరుకున్నారు. గర్భిణి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం ప్రారంభించారు. అయితే సోమశిల కొల్లాపూర్ సమీపానికి చేరుకునే సరికి అనుషకు ప్రసవ నొప్పులు ఒక్కసారిగా తీవ్రమయ్యాయి, ఆసుపత్రికి చేరుకునేలోపు ప్రసవం జరిగే పరిస్థితి కనిపించడంతో అంబులెన్సు వెంటనే సురక్షిత ప్రదేశంలో నిలిపివేశారు. ఆ సమయంలో ఈఎంటీ రాఘవేంద్ర మెడికల్ టెక్నీషియన్ నరేందర్ ఏమాత్రం ఆందోళన చెందకుండా తన అనుభవాన్ని, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ అత్యంత జాగ్రత్తగా అంబులెన్స్ లోనే ప్రసవం నిర్వహించారు.కొద్ది సేపటికే పండంటి అనూష ఆరోగ్యవంతమైన పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.ప్రసవం అనంతరం కొల్లాపూర్ మాత శిశు సంక్షేమ ఆస్పత్రిలో అడ్మిట్ చేయడం జరిగింది. డాక్టర్ సూచనలతో తల్లి, శిశువుకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఈఎంటీ రమేష్ నాయక్, అంబులెన్స్ పైలట్ నరేందర్ పైలెట్ రాఘవేంద్ర నిరంతర పర్యవేక్షణలో ఇద్దరినీ సురక్షితంగా కొల్లాపూర్ మాత శిశు సంక్షేమ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న గ్రామ ప్రజలు 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను ప్రశంసలతో ముంచెత్తారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడిన ఈఎంటీ నరేందర్ పైలెట్ రాఘవేంద్ర, సేవలు అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు ఎంతటి భరోసానిస్తున్నాయో ఈ ఘటన మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనూ సేవాధర్మాన్ని ముందుంచుకుని విధులు నిర్వర్తిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. వారి సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని, ఇలాంటి వైద్య సిబ్బందిని ప్రభుత్వం మరింత.ప్రోత్సహించాలని గ్రామస్థులు కోరారు.ఈ ఘటనపై గ్రామస్థులు 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను ప్రశంసించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడిన ఈఎంటీ రాఘవేంద్ర, మెడికల్ టెక్నీషియన్ నరేందర్, ఆశా కార్యకర్త చిన్న లక్ష్మమ్మ సేవలను కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, వనపర్తి జిల్లా మేనేజర్ రత్నమయ్య కూడా అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో 108 సేవలు ప్రజలకు ఎంతటి భరోసానిస్తున్నాయో ఈ ఘటన మరోసారి నిరూపించిందని స్థానికులు పేర్కొన్నారు.



## 498-ఏ కేసులో ఇద్దరు దోషులకు ఏడాది జైలు శిక్ష

**మహబూబ్‌నగర్, జూలై 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** మహబూబ్‌నగర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదు చేసిన 498-ఏ ఐపీసీ కేసులో నిందితులపై నేరం రుజువుకావడంతో మహబూబ్‌నగర్ ప్రధాన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, బాధితురాలు కె. పావని వివాహం 11 డిసెంబర్ 2005న కె. వెంకట్ రెడ్డితో జరిగింది. వివాహ సమయంలో కట్నంగా రూ.1.50 లక్షలు ఇచ్చినప్పటికీ, అనంతరం భర్త కె. వెంకట్ రెడ్డి, మామ కె. తిమ్మా రెడ్డి, అత్త వెంకటమ్మ అదనపు కట్నం కోసం బాధితురాలిని శారీరకంగా, మానసికంగా వేధించినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే ఆమెపై అనుమానాలు వ్యక్తం చేయడం, భర్త మరో మహిళతో సంబంధం కొనసాగించడం, బాధితురాలి విద్యా ధ్రువపత్రాలను దహనం చేయడం వంటి ఆరోపణలు కూడా విచారణలో వెలుగుచూశాయి.ఈ వేధింపులను తట్టుకోలేక బాధితురాలు 16 జూన్ 2015న ఆత్మహత్యాయత్నం చేయగా, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆమె ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా మహబూబ్‌నగర్ ప్రధాన జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. మమతా రెడ్డి నిందితులైన కె. వెంకట్ రెడ్డి, కె. తిమ్మా రెడ్డిలను దోషులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.